ఈనాడు
మంచిర్యాల
శుక్రవారం అక్టోబరు 25, 2024 7

పోరుబాట.. అన్నదాతకు బాసట

● కేటీఆర్ సభతో భారాసలో ఉత్తేజం ● గుజరాత్ తరహాలో పత్తికి మద్దతు ధర ఇచ్చే వరకు పోరాడతామని వెల్లడి..



హాజరైన జనం

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందంటూ.. భారాస ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణం రాంలీల మైదానంలో గురువారం నిర్వహించిన రైతు పోరు బాట సభ ఆ పార్టీలో ఉత్తేజం నింపింది. సభ కోసం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రైతులను, ప్రజలను ఎక్కువ సంఖ్యలో తరలించగా.. బోథ్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం తరలివచ్చారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఉదయం 11.30 గంటలకు హాజరవుతారని చెప్పడంతో అనుకున్న సమయానికి ముందే జనం అక్కడికి చేరుకున్నారు. మేడ్చల్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం, డిచ్‌పల్లి వద్ద రహదారిపై పోలీసు కుటుంబాల ఆందోళనకు మద్దతు ఇవ్వడం, మధ్యలో కార్యకర్తల సన్మానాలతో ఆయన మధ్యాహ్నం 1.30కు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఇదే విషయాన్ని సభలో వెల్లడించారు. ప్రజలు ఓపిగ్గా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు భూమారెడ్డి, జనార్దన్‌లు రుణమాఫీ, రైతు భరోసా ఆలస్యంపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ఆలోచింపజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరిస్తామని చెప్పి గెలుపొందిన భాజపాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే కాలంలో అదానికి సీసీఐని అమ్మేస్తారని పేర్కొన్నారు. సింగరేణిపైనా అదాని గురిపెట్టారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పూర్తి సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు.

మేం అధికారంలోకి వచ్చాక ఏకపక్షంగా వ్యవహరించే వారికి మిత్తితో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇలా వ్యవహరించే అధికారులు, పోలీసుల పేర్లు రాసుకోవాలని జోగురామన్నకు సూచించారు.



సభలో అభివాదం చేస్తున్న కేటీఆర్

కార్యకర్తలంతా రైతుల కల్లాల దగ్గరకు వెళ్లి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

సమంజసం కాదు..

రుణమాఫీ కాలేదని తలమడుగు మండలం రుయ్యాడిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తే రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమంటూ కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా పేరిట ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువు వద్ద ఇళ్లు కూలగొట్టేందుకు మార్కు వేసేందుకు వస్తే సీఎంను దూషించారని గంగన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారన్నారు. మరి వంద రోజుల్లో పథకాలు అమలుచేస్తామని చెప్పి మోసగించిన సీఎంపై ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు నమోదు చేయడం లేదంటూ ప్రశ్నించారు.

అన్ని నియోజకవర్గాల్లో..

రైతులకు న్యాయం చేకూర్చేలా, భరోసా ఇచ్చేలా జోగురామన్న రైతు పోరు బాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోరుబాటు ఉంటుందని వెల్లడించారు. కార్యాచరణ సిద్ధం చేయాలని వేదికపై ఉన్న వివిధ నియోజకవర్గాల నేతలకు కేటీఆర్ సూచించారు. భారాస జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి పాల్గొన్నారు. కేటీఆర్ వెంట హుజూరాబాద్, కోరుట్ల ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌లు సభకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బాల్కసుమన్, జడ్పీ మాజీ ఛైర్మన్ రాథోడ్ జనార్దన్, మున్సిపల్ ఛైర్మన్ ప్రేమేందర్, నాయకులు జాన్సన్ నాయక్, తుల శ్రీనివాస్, లోలంశ్యాంసుందర్, చారులత, రౌతు మనోహర్, సతీష్‌పవార్, మార్‌శెట్టి గోవర్ధన్, యూనుస్ అక్బానీ, అజయ్, సాజిదొద్దీన్, మనీషా, స్వరూప, మమత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో నాణ్యమైన పత్తి

గుజరాత్‌లో పత్తికి క్వింటాలుకు రూ.8,800 ఇస్తే ఆదిలాబాద్‌లో మాత్రం అదే భారత పత్తి సంస్థ తక్కువ ధర ఇవ్వడం విడ్డూరమంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. ఆదిలాబాద్ పత్తి రైతులకు గుజరాత్ తరహాలో ధర లభించే వరకు పోరాడుతూనే ఉంటామని, భాజపాకు చెందిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూనే ఉంటామని భరోసా ఇచ్చారు.



కేటీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న నాయకులు, చిత్రంలో రామన్న, అనిల్‌జాదవ్, జనార్దన్ రాథోడ్

నాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి

జోగు రామన్న, భారాస జిల్లా అధ్యక్షుడు

బేలలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారని నాపై కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఉట్నూర్‌లో కేటీఆర్‌పై కేసు నమోదుకాక ముందే హామీల అమలులో మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఫలితం లేదు.

అన్నదాతలకు అప్పు దొరకడం లేదు


అనిల్‌జాదవ్ బోథ్ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే ఒక మాటల గారడి. వర్షాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. అక్టోబరు వచ్చినా ఇంకో భరోసా ఖాతాలో జమకాలేదు. కేసీఆర్ హయాంలో రైతుబంధు వస్తుందనే ఉద్దేశంతో ఖర్చుల కోసం రైతులు షావుకారు వద్దకు వెళితే అప్పుదొరికేది. కాంగ్రెస్ హయాంలో అన్నదాతలకు అప్పు పుట్టడం లేదు.

గంటల తరబడి కరెంటు కోతలు

కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ హయాంలో ఏ వర్గానికి న్యాయం జరగడం లేదు. రైతు భరోసా, పింఛను సొమ్ము పెంచుతామని మోసం చేశారు. గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తున్నారు. మరోపక్క ఉచిత కరెంటు అంటూనే ఎవరికి వర్తింపజేయడంలేదు. పది నెలలు కావొస్తున్నా ఎక్కడా రోడ్డుపని సైతం మొదలెట్టలేదు.



నేడే దీపావళి బోనస్ చెల్లింపు

● ప్రారంభంలో రూ.300.. ప్రస్తుతం రూ.93,750

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే

ప్రాణాలకు తెగించి ప్రకృతికి విరుద్ధంగా విధులు నిర్వహిస్తూ దేశానికి వెలుగులు నింపుతున్న సింగరేణి ఉద్యోగులకు సంస్థ శుక్రవారం దీపావళి బోనస్ వారి ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకు రూ.358 కోట్ల నిధులను సంస్థ కేటాయించింది. బొగ్గుగని కార్మికుల ప్రొడక్షన్ లింక్డ్ రివార్డు(పీఎల్‌ఆర్) ఆరు దశాబ్దాలుగా అందిస్తున్నారు.

పార్లమెంటు ఆమోదంతో..

గని కార్మికులకు వారి శ్రమకు ఏడాదికి ఒకసారి బోనస్ చెల్లించాలన్న డిమాండ్‌పై 1962లో తొలిసారిగా గని కార్మికులకు రూ.300 బోనస్ చెల్లించారు. ఏఐటీయూసీ నాయకులు దీనిపై పోరాటం చేసి బోనస్ ప్రయోజనాన్ని సాధించారు. అప్పటి నుంచి ఏటా దీపావళి సమయంలో కార్మికులకు బోనస్ చెల్లిస్తూ వస్తున్నారు. దీనిపై 1965లో పార్లమెంటులో చట్టం తీసుకువచ్చారు. ఏటా గని కార్మికులకు బోనస్ చెల్లించాలని పార్లమెంటులో బిల్లు ఆమోదించినప్పటి నుంచి దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు వర్తింపజేస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి కార్మికులకు కూడా అందులో భాగంగా దీపావళికి ముందు పీఎల్‌ఆర్ పంపిణీ చేస్తున్నారు.

14,500 మంది కార్మికులకు..

జిల్లాలోని మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో పని చేస్తున్న దాదాపు 14,500 మంది సింగరేణి ఉద్యోగులకు బోనస్ అందనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజుల వాస్తవిక హాజరు ఉన్న ప్రతి ఒక్కరికి బోనస్ వర్తింపజేస్తారు. ఈ ఏడాది రూ.93,750 చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. గత సంవత్సరం రూ.85,500 చెల్లించారు. గత ఏడాదికంటే ఈ సారి రూ.8,250 అదనంగా కార్మికులకు పంపిణీ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఎంతో కొంత పెంచుకుంటూ ఉద్యోగులకు అమలు చేస్తున్నారు. దేశంలోని కోల్ ఇండియాలో పీఎల్‌ఆర్‌ను దసరా ముందు చెల్లించడం ఆనవాయితీ కాగా సింగరేణిలో మాత్రం దీపావళికి ముందు చెల్లిస్తూ వస్తున్నారు. 8 బొగ్గు పరిశ్రమలతోపాటు సింగరేణి సంస్థలో పని చేస్తున్న అర్హులైన ఉద్యోగులకు బోనస్ వర్తిస్తుంది.

ఎగరని డ్రోన్.. ఆదాయం ధమాల్



హాజీపూర్ మండల సమాఖ్యకు అదనపు ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు కనీసం ఒక్కరికైనా ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 25 శాతం రాయితీపై రూ.10 లక్షల నిధులు వెచ్చించి 2022లో డ్రోన్ కొనుగోలు చేశారు. రైతులు సాగు చేసిన పంటలపై పురుగుమందులను చల్లేందుకు వినియోగించేలా ఉపయోగిస్తారు. దీని కోసం ఒక్కో రైతు వద్ద అద్దె తీసుకుంటారు. ఈ ఆలోచన బాగానే ఉన్నప్పటికీ ఆ డ్రోన్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా కొనుగోలు చేసిన మూడు నెలలకే ఆ యంత్రం బ్యాటరీలు మరమ్మతులకు గురికావడంతో రెండేళ్లుగా మూలనపడింది. కొనుగోలు చేసిన మూడు నెలల్లో 40 మంది రైతుల పంట పొలాల్లో ఎరువులు చల్లడంతో సుమారు రూ.34 వేల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం డ్రోన్ మూలనపడటంతో అధికారులు పట్టించుకోవడం లేదని మండల సమాఖ్య సభ్యులు మండిపడుతున్నారు. **- న్యూస్‌టుడే, హాజీపూర్**

బాధితులకు మెరుగైన వైద్య సేవలు

హాజీపూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే బాధితులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ వైద్యులకు సూచించారు. గురువారం హాజీపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంతోపాటు మండంలోని గుడిపేట, హాజీపూర్, ముల్కల్ల, వేంపల్లి పంచాయతీలను సందర్శించారు. ఆసుపత్రిలోని రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సబ్బేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి పాఠశాల నిర్వహణపై ఆరా తీశారు. గుడిపేటలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయ భవనాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

వాగు ఆక్రమించి.. వంతెన నిర్మించి..



వాగుపై నిర్మించిన వంతెనను పరిశీలిస్తున్న డీఈ నారాయణ్

కాసిపేట, న్యూస్‌టుడే: వాగుపై ఎలాంటి అనుమతులు లేకుండా సీసీ వంతెనను నిర్మించడం మండలంలో చర్చనీయాంశం అయింది. కాసిపేట మండలంలోని పెద్దనపల్లి శివారు జాతీయ రహదారి ఆనుకుని ఇటీవల పలువురు ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వెళ్లే దారిలో వాగు ఉండటంతో అనుమతులు రాకముందే వంతెన నిర్మించారు. తాత్కాలిక వంతెన నిర్మించుకోవాలని సూచిస్తే ఏకంగా సీసీ వంతెన ఏర్పాటు చేయించారని నీటిపారుదలశాఖ డీఈ నారాయణ్ ఇటీవల పరిశీలించారు. నిర్మాణాన్ని కూల్చివేయాలని ఏఈని ఆదేశించారు. అనుమతులు లేకుండా వాగులను కబ్జా చేసుకొని నిర్మాణాలను చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రోడ్డెక్కిన పోలీసు కుటుంబాలు



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న పోలీసు కుటుంబ సభ్యులు

హాజీపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రమంతా ఒకే పోలీస్ వ్యవస్థ ఉండాలని డిమాండ్ చేస్తూ పోలీసు కుటుంబాలు జిల్లాలో రోడ్డెక్కి ఆందోళనకు దిగాయి. హాజీపూర్ మండలంలో గుడిపేట 13వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశాయి. గురువారం పటాలం ముందు జాతీయ రహదారిపై బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సెలవుల విధానాన్ని మార్చాలని, పనిభారాన్ని తగ్గించాలని నినదించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం శాంతిభద్రతలు కాపాడే పోలీస్ వ్యవస్థలో ఏక్ పోలీస్ విధానాన్ని అనుసరించడం లేదన్నారు. రిజర్వ్ పోలీస్‌ఫోర్స్ కానిస్టేబుళ్ల వెట్టిచాకిరీ చేస్తున్నా వారి కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. విధి నిర్వహణ పేరుతో వారిని కుటుంబాలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కొత్తగా అమల్లోకి తీసుకురానున్న రికార్డు పద్ధతిని ఉపసంహరించుకోవాలన్నారు. పటాలం కమాండెంట్‌లు ఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి : కలెక్టర్



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఏసీసీ, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత భవిష్యత్తుపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం డీసీపీ భాస్కర్‌తో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం, సాగు, రవాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యాసంస్థల్లో దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించి నమోదైన కేసుల్లో 18 నుంచి 23 సంవత్సరాల వయస్సుగల వారే 344 మంది ఉన్నారన్నారు. డీఈవో యాదయ్య, వైద్య ఆరోగ్యశాఖాధికారి హరీశ్‌రాజ్, వ్యవసాయ అధికారి కల్పన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఏసీసీ: జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో చేపడుతున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. జిల్లా పరిధిలోని ఆసుపత్రులకు మందుల పంపిణీకి అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సత్యదేవుడి ఆలయంలో పురాణ విజ్ఞాన ప్రవచనాలు



గూడెంలో సత్యదేవుడి ప్రవచనాలను చెబుతున్న బాల బ్రహ్మానంద సరస్వతి

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రెండో అన్నవరంగా పేరుగాంచిన దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి పురాణ విజ్ఞాన ప్రవచనాలను గురువారం నైమిశారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మానంద సరస్వతి చెప్పారు. ముందుగా ఆయనకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బ్రహ్మానంద సరస్వతి సత్యదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి లీలా విలాసం ప్రవచనాలను వినిపించారు.



మందమర్రిలో అసంపూర్తిగా ఉన్న చేపల మార్కెట్ భవనం

2016లో

మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు మంజూరు కావడంతో చేపల విక్రయానికి ప్రత్యేకంగా మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధులు సరిపోక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం రూ.10 లక్షలు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారు పనులు చేపట్టడానికి ముందుకు రాలేదు.

అపరిశుభ్ర వాతావరణంలో..

క్రిమికీటకాలు దరిచేరకుండా చేపలు, మాంసం కనీసం మూడు అడుగుల ఎత్తులో పరిశుభ్ర వాతావరణంలో అమ్మకాలు సాగించాల్సి ఉంటుంది. మిగిలిన వాటిని భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్ వంటి సౌకర్యం అవసరం. కానీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని పురపాలికల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. చాలా ప్రాంతాల్లో చేపలను నేల మీద కూరగాయలు అమ్మిన విధంగా అమ్మకాలు సాగిస్తున్నారు. 2016లో దాదాపు అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లో చేపల మార్కెట్ నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.



మంచిర్యాలలో రహదారి పక్కన చేపలను విక్రయిస్తున్న మత్స్యకారులు

మీనం పుష్కలం.. అమ్మకం గగనం

● ఉమ్మడి జిల్లాలో మార్కెట్లు కరవు

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే

చేపల విక్రయానికి ప్రత్యేకంగా మార్కెట్లు లేకపోవడంతో మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నీలి విప్లవం పేరిట ప్రభుత్వం వంద శాతం రాయితీపై చెరువుల, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదులుతుండగా వాటికి సరైన మార్కెటింగ్‌కు అవకాశం లేక ఇబ్బందులు తప్పడం లేదు. పాత పురపాలికల్లో కూరగాయల మార్కెట్లలో అమ్మకాలు సాగుతుండగా కొత్త పురపాలికల్లో ఇప్పటికీ తగిన ఏర్పాట్లు లేవు. పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టి ప్రత్యేకంగా స్టాళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టగా అవి అసంపూర్తిగా మిగిలాయి.

మత్స్య సంపదకు అనుకూలం

ఉమ్మడి జిల్లాలో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయి. చేపల పెంపకానికి అనువుగా మొత్తం 1,501 చిన్న నీటి వనరులను అధికారులు గుర్తించారు. 14 రిజర్వాయర్లలో ఇప్పటికే చేపల పెంపకం సాగుతోంది. గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి జలాశయం మత్స్య పరిశ్రమకు ఊతంగా నిలుస్తోంది. దీని ద్వారా మత్స్య సహకార సంఘాల్లోని 19,150 కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధి పొందుతున్నాయి. ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకోవడానికి వీలుగా వాహనాలను రాయితీపై ప్రభుత్వం అందజేసినా ప్రత్యేకంగా కోల్డ్ స్టోరేజీకి అవకాశం లేకపోవడం, అన్ని హంగులతో మార్కెట్ల నిర్మాణం ఇంకా చేపట్టకపోవడం మత్స్యకారులకు ఇబ్బందికరంగా మారింది.



ఎల్లంపల్లిలో జాలర్లకు చిక్కిన 15 కిలోల చేప




జిల్లాలవారీగా వివరాలు ఇలా...

కౌన్సిలర్ దూషించాడంటూ మున్సిపల్ ఉద్యోగుల ధర్నా



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఏఈ సందీప్‌ను కౌన్సిలర్ గడ్డం అశోక్‌గౌడ్ సామాజిక మాధ్యమంలో ఇష్టానుసారంగా దూషించాడంటూ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వాట్సాప్ గ్రూపులో తనపై ఇష్టం వచ్చినట్లు అసభ్యకరంగా కౌన్సిలర్ పోస్టులు చేశారని ఏఈ ఆరోపించారు. కౌన్సిలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే వరకు తాము విధుల్లో చేరమని తేల్చి చెప్పారు. అనంతరం ఏసీపీ రవికుమార్‌కు కౌన్సిలర్‌పై ఫిర్యాదు చేశారు.



ఇక్కడా విజయం సాధించాలి..!!

● ప్రతిభావంతులైన మీరు పనిమంతులవ్వాలి



పొన్కల్‌లో నూతన పశువైద్యాధికారిని సన్మానిస్తున్న గ్రామస్థులు

మామడ, న్యూస్‌టుడే: ఈ పోటీ ప్రపంచంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటే వారు ఎంతో ప్రతిభావంతులన్నట్లే. లక్ష్యం పెట్టుకొని ప్రణాళికతో చదివి తమ మేధస్సుతో ఇతరులకన్నా వేగంగా ముందుకెళ్లిన వారే అందరూ.. మూడు పదుల వయస్సుకు ముందే స్థిరమైన స్థానానికి చేరుకొని మంచి జీతంతో చక్కని జీవితాన్ని గడపొచ్చు. కళాశాల, తరగతి గది, శిక్షణ కేంద్రాలు, పుస్తకాలతో కుస్తీ వీటన్నింటినీ దాటుకుంటూ వెళ్లిన వారు జనాల మధ్యకు వచ్చేశారు. ఇప్పుడు ఓ కొత్త జీవితాన్ని ప్రారంభించారు. పాఠాల్లో చదివిన అంశాలే ఇక్కడ ఉండవు. కొత్త బాధ్యతలు నిర్వర్తించాలి. అప్పడప్పుడు సవాళ్లూ ఉంటాయి. అంకితభావంతో పనిచేస్తే ఇక్కడా మీరు విజయం సాధించొచ్చు..

రాగానే స్వాగతం చెప్పారు చూడండి..

ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులు నియామకమయ్యారు. మామడ మండలం పొన్కల్ పశువైద్యాధికారిగా శ్రహియార్ తాజాగా బాధ్యతలు స్వీకరించారు. పశువైద్య కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తొలిరోజు ఆయనకు గ్రామస్థులు చక్కగా స్వాగతం పలికారు. పశుపోషకుల అవసరాలను గుర్తించి మంచి సేవలందిస్తే జనాలతో మరింత అనుబంధం పెరుగుతుంది.

విసుక్కోకండి..



అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, నాయకులు.. ఇలా ఎన్నో వర్గాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయాధికారినే తీసుకుంటే మండలం మొత్తానికి అధికారి. ఆ ఒక్కరి పరిధిలో వేలాది మంది రైతులు ఉంటారు. అతివృష్టి, అనావృష్టి, పంట సర్వేలు, పరిహారం చెల్లింపులు వంటి విషయాల్లో చాలా చురుకుగా పనిచేయాలి. ఈ క్రమంలో కొన్ని సార్లు ప్రతికూలతలు ఎదురవుతాయి. ఉద్యోగ సాధనలో కుంగుబాటుకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో విజయం సాధించినట్లే ఇక్కడా మీ పనితనాన్ని చూపించాలి. ఎవరు ఎప్పుడు ఏ సమస్య చెప్పినా ఓపికగా వినాలి. విసుక్కోకుండా మనతో అయ్యే సాయాన్ని అందించాలి.

గురువులుగా మీరు..



హస్నాపూర్ తండాలో విధులు నిర్వర్తిస్తున్న కొత్త ఉపాధ్యాయుడు సంపత్

కొత్త ఉద్యోగుల్లో ఉపాధ్యాయులే అధికం. ఎంతో కష్టపడి చదివి గురువులుగా మారిన వారు భావిభారత పౌరులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అనుభవాలు.. ప్రతిభను రంగరించి విధి నిర్వహణలో అంకితభావం కనబరిస్తే శిష్యులు మంచి స్థానాలకు చేరుకుంటారు.

వీలైతే పనిచేసే చోట ఉండండి..

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు ఉత్సాహంగా పనిచేయాలి. ఇందుకు మంచి అవకాశం పనిచేసే ప్రదేశంలో నివాసం ఉండటం. పట్టణాల్లో పుట్టి పెరిగిన వారు పల్లెటూరిలో నివాసం ఉండగలిగితే పల్లె ప్రజల ఆత్మీయతను చూరగొంటారు. సమయపాలన పాటించొచ్చు. వివాహమై కుటుంబ బాధ్యతలు పెరిగాక ఎలాగూ గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండలేరు.

ఓ సామాజిక కార్యకర్తగా భావించాలి:



రైతులు, ప్రజలకు సేవ చేసే అవకాశం ఓ ప్రభుత్వ ఉద్యోగిగా కొందరికే దక్కుతుంది. ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగంగా మాత్రమే కాకుండా అంకితభావంతో నిర్వర్తిస్తే వచ్చే గుర్తింపు ఉద్యోగ విరమణ పొందినా ఉంటుంది. సమాజం కోసం సామాజిక కార్యకర్తగా భావించి పనిచేయాలి. నా ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ప్రాంతాల్లో పనిచేశాను. ఇప్పటికీ పనిచేసిన ప్రతి చోటు నుంచీ నాకు ఫోన్ చేస్తుంటారు. వారిచ్చే గౌరవం, చూపించే ప్రేమ ఎన్ని డబ్బులు పెట్టినా కొనలేం. కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా మనం వారికి చేసే సేవనే సంతృప్తినిస్తుంది. **-అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్**

ఆ ఆనందమే వేరు..

మనీష, తానూరు మండల వ్యవసాయాధికారి

నేను మొదటి ఉద్యోగం మామడ మండలంలో ఏఈవోగా పనిచేశాను. తాజాగా ఏవోగా ఎంపికయ్యాను. క్షేత్ర స్థాయిలో రైతులకు అనేక ఇబ్బందులు ఉంటాయి. వారికి అందుబాటులో ఉండి అవసరమైన పనులు చేస్తే రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తుంది. అప్పుడు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఏదైనా మన పనితీరుతోనే గుర్తింపు లభిస్తుంది.



రైతుల వివరాలు సేకరిస్తూ..

పనిమంతులైతే గుండెల్లో నిలిచిపోతారు..

ఉపాధ్యాయులు, పశువైద్యాధికారులు, వ్యవసాయాధికారులు, ఏఈఓలు, ఎస్సైలు..ఇలా వివిధ హోదాల వారు కొత్తగా విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో వెయ్యి మందికి పైగానే నూతన ఉద్యోగులు ఉన్నారు. ఇన్నాళ్లూ ఓ వ్యక్తిగా తన ఇష్టాలకు అనువుగా ఉండొచ్చు. ఇప్పుడు మాత్రం వ్యవస్థ కోసం పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న వారు పనిమంతులై ఉత్తమ ఉద్యోగులుగా రాణిస్తే జనాల గుండెల్లో నిలిచి పోతారు.

జనవరి నాటికి ఆర్మూర్ రైల్వే మార్గంపై తుది నివేదిక : ఎంపీ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ నగేష్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లావాసులు ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ - ఆర్మూర్ వయా నిర్మల్ రైల్వే మార్గం సర్వే జరుగుతోందని, తుది నివేదికను జనవరి 25లోగా రైల్వేబోర్డుకు సమర్పించనున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. ఆదిలాబాద్ వరకు పలు రైళ్ల పొడిగింపుతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో మరిన్ని రైళ్లు ఆగేలా నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలను ప్రస్తావించగా.. జీఎం నుంచి సానుకూల స్పందన లభించినట్లు ఎంపీ వివరించారు. ఆదిలాబాద్ - గడ్‌చందూర్ మార్గం డీపీఆర్, అంచనా నివేదిక డిసెంబర్ 24లోగా రైల్వేబోర్డుకు ఇస్తామని, ఆదిలాబాద్‌కు రూ.17.76 కోట్లు, బాసరకు రూ.11.33 కోట్లు కేటాయించి అమృత్ స్టేషన్లుగా ఆధునికీకరిస్తామని అధికారులు సమాధానమిచ్చారని పేర్కొన్నారు. బల్లార్షా-కాజీపేట మార్గంలో రెబ్బెన వద్ద రోడ్డు ఓవర్‌బ్రిడ్జి, ముథ్కేడ్ - పిప్పల్‌కోటి వరకు డబుల్‌లైన్ సర్వే చేసేందుకు చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. నాందేడ్, నాగ్‌పూర్‌ల నుంచి తపోవన్, రాజారాణి, పుణె-నాందేడ్, బెంగళూరు, మరట్వాడ సంపర్క్ క్రాంతి, పన్‌వేల్, పుణె-నాందేడ్ రైళ్లను ఆదిలాబాద్ స్టేషన్ వరకు పొడిగించేందుకు అధికారులు అంగీకరించారన్నారు. విశాఖపట్నం - సాయినగర్, సికింద్రాబాద్-జైపూర్, రామేశ్వరం-బోకే, యశ్వంత్‌పూర్-ఇండోర్, తిరుపతి-అమరావతి, హైదరాబాద్-జైపూర్, తిరుపతి-అకోల నగరాల నడుమ నడిచే 8 రైళ్లు బాసర స్టేషన్‌లో ఆగేలా చూడాలని విన్నవిస్తే జీఎం సానుకూలత వ్యక్తం చేశారని ఎంపీ వివరించారు.

బంగారు దుకాణంలో దొంగతనం

● 5 కిలోల వెండి, రెండున్నర తులాల స్వర్ణం అపహరణ



దొంగతనం జరిగిన దుకాణం ముందు తనిఖీలు చేస్తున్న పోలీసులు

కుభీరు, న్యూస్‌టుడే : కుభీరులోని "ఆకాశ్" బంగారు దుకాణంలో గురువారం వేకువజామున దొంగతనం జరిగింది. ఎస్సై రవీందర్, బాధితుల కథనం మేరకు.. ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు దుకాణం ముందు భాగంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఇనుప చువ్వలగేటు, షట్టర్‌ను బద్దలు కొట్టారు. దుకాణం లోపలిభాగంలోని సీసీ కెమెరాలకు నల్లని రంగును స్ప్రే చేశారు. అనంతరం దుకాణంలోని 5 కిలోల వెండి వస్తువులు, రెండున్నర తులాల బంగారం, రూ.45 వేల నగదు ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున స్థానిక విఠలేశ్వరుని ఆలయంలో జరిగే కాగడా హారతికి వెళ్లేందుకు ఆకాశ్ కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు. దుకాణ ద్వారం తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నైలునాయక్, ఎస్సై రవీందర్ చేరుకుని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఖానాపూర్‌లో ఆహార అధికారి ఆకస్మిక తనిఖీలు

ఖానాపూర్, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ఆహార అధికారి ప్రత్యూష అన్నారు. ఖానాపూర్ పట్టణంలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో రాందేవ్ కాస్మెటిక్స్ దుకాణంలో రూ.9 వేలు విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. లారీ అడ్డా ప్రాంతంలోని రాణిగారి బిర్యాని దుకాణంలో తనిఖీలు చేపట్టారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెస్టారెంట్‌లు నడపడానికి నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని.. లేనిపక్షంలో రూ.5 లక్షలు జరిమానా, 6 నెలలు సీజ్ చేస్తామన్నారు. నమూనాల ఫలితాలు 20 రోజుల్లో వస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పద పద.. తడోబా..



సందడి చేస్తున్న సందర్శకులు



● విహరిద్దాం.. పులులను దగ్గరగా చూసేద్దాం

పెద్ద పులుల గాండ్రింపులు, జింకల పరుగులు, పచ్చని చెట్లు, చక్కని నీటి వనరులు.. వీటన్నింటినీ ఓ సఫారీ జీప్‌లో చూస్తూ అలా ప్రకృతిలో విహరించాలని ఎవరికైనా ఉంటుంది. నిత్యం ఒత్తిళ్లతో సహవాసం చేస్తున్న మనకు ప్రకృతిలో ఒకరోజు సేదతీరేందుకు చక్కటి ప్రాంతం తడోబా అభయారణ్యం. దేశంలో ప్రసిద్ధిగాంచిన అభయారణ్యాలలో ఇది ఒకటి. మహారాష్ట్రలో ఉన్న ఈ ప్రాంతం పులులకు పుట్టినిల్లు. విశాలంగా, అనేక రకాల వన్యప్రాణులకు నెలవైన ఈ అరణ్యాలను చూసేందుకు దేశ విదేశాల నుంచి విశేషంగా పర్యాటకులు తరలి వస్తుంటారు. వర్షాకాలంలో మూడు నెలలు మూసి ఉండగా.. ఇటీవలే తెరిచారు. వందల సంఖ్యలో సందర్శకులు వీక్షిస్తున్నారు.

–న్యూస్‌టుడే, బల్లార్ష

ఎలా చేరుకోవచ్చంటే..

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఉన్న ఈ అరణ్యం దాదాపు 1727 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఇందులో 626 చ.కి.మీ. విస్తీర్ణంలో కోర్ జోన్ ఏర్పాటు చేశారు. అందులో వన్యప్రాణులు సంచరించేందుకు వీలు కల్పించారు. మిగిలిన ప్రాంతమంతా బఫర్ జోన్. రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోవచ్చు. కుమురంభీం జిల్లా కేంద్రం నుంచి 120 కి.మీ. హైదరాబాద్ నుంచి 390 కి.మీ.లో దూరం ఉంటుంది. చంద్రపూర్ రైల్వే స్టేషన్ నుంచి వాహనాల సదుపాయం ఉంటుంది. విమాన మార్గంలో నాగపూర్ చేరుకుంటే అక్కడ నుంచి 150 కి.మీ. దూరంలో ఈ ప్రాంతం ఉంటుంది.

రోజులో రెండు సార్లు..



రోజూ ఉదయం 6 గంటలకు పర్యాటకులతో జిప్సీలు బయలు దేరుతాయి. లోపల ఉదయం 10 గంటల వరకు సంచరిస్తుంటాయి. మళ్లీ మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పర్యటన ఉంటుంది. చరవాణులు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లలోని తినుబండారాలను అనుమతించరు.



చెరువు వద్ద కూనలతో సేదతీరుతున్న పులి

పులులే ఆకర్షణ..

ఇక్కడ 100కు పైగా పెద్దపులులు, 64 చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి బర్రెలు, జింకలు, నెమళ్లు, వివిధ రకాల వన్యప్రాణులు ఉన్నాయి. ఈ అరణ్యాలలో తడోబా, కోడసా అనే ప్రధాన చెరువులతోపాటు అంధేరీ నది పరీవాహక ప్రాంతం ఉంటుంది. వన్యప్రాణులు దాహార్తి తీర్చుకునేందుకు సహజసిద్ధమైన కొలనులను సైతం అటవీ అధికారులు ఏర్పాటు చేశారు.

24 రోజుల్లో అయిదు వేల మంది..

అభయారణ్యాలలో ఈ నెల 1వ తేదీ నుంచి పర్యాటకులను అనుమతినివ్వగా.. ఇప్పటి వరకు 5,250 మంది సందర్శించినట్లు అటవీ అధికారులు ప్రకటించారు.

సందర్శన ఇలా..

సందర్శించేందుకు పర్యాటకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అభయారణ్యాల లోపలికి ఆరు మార్గాల ద్వారా పర్యాటకులను అనుమతిస్తారు. నాగపూర్ నుంచి వచ్చే వారికి కోలార, చంద్రపూర్ మార్గం గుండా వెళ్లేవారికి మోహర్లీ ద్వారం అనుకూలంగా ఉంటాయి. పర్యాటకుల కోసం మోహర్లీ వద్ద 32, కోలార వద్ద 12, నవేగావ్ వద్ద 6, కుంటవండా 4, జరీ 4, పంగడి 2.. ఇలా 60 ఓపెన్ టాప్ జిప్సీలు ఉంటాయి. ఒక జిప్సీలో ఆరుగురిని మాత్రమే అనుమతిస్తారు. డ్రైవర్‌తోపాటు ఒక గైడ్ ఉంటారు. పర్యాటకుల కోసం ప్రతి ద్వారం వద్ద ప్రత్యేక వసతి గృహాలు ఉన్నాయి. ప్రతి మంగళవారం సెలవు. వారాంతపు రోజుల్లో ప్రతి జిప్సీకి రూ.7,100, మిగిలిన రోజులలో రూ.6,100 ఫీజు వసూలు చేస్తారు.

'మాయా' ప్రత్యేకం

ఇక్కడ మాయా అనే పులిని రారాజుగా పిలుస్తారు. దీన్ని చూసేందుకు ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ ఏటా కుటుంబ సమేతంగా వస్తారు. మూడురోజులపాటు ఇక్కడ సేద తీరుతారు. ఇవే కాక తార, నయనతార అనే పులులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సినిమా హీరో నాగ చైతన్య సైతం తరచూ తడోబాను సందర్శిస్తారు.

'జైనూర్ ఘటన ప్రభుత్వ వైఫల్యమే'



మాట్లాడుతున్న ఖలీదా పర్వీన్, చిత్రంలో అబ్దుల్ ఖదీర్, అబ్దుల్ అజీజ్, శారా మాథ్యూ, డా.కుమార్, ఎంఏ షకీల్, సయ్యద్ మాజిద్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆసిఫాబాద్ ప్రాంతం జైనూర్‌లో మూకదాడి, దుకాణాల కాల్చివేత ప్రభుత్వ వైఫల్యంతోనే జరిగిందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. కుగ్రామంలో వందలాది మంది గుమిగూడుతున్న విషయాన్ని ప్రభుత్వ నిఘా సంస్థలు గుర్తించలేకపోయాయా? విషయం తెలిసినా వదిలేశారా? అని ప్రశ్నించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సామాజిక కార్యకర్తలు ఖలీదా పర్వీన్, శారా మాథ్యూ, మహమ్మద్ అబ్దుల్ అజీజ్, డా.కుమార్ మాట్లాడుతూ.. జైనూర్‌లో దాడి చేసిన వారెవ్వరూ స్థానికులు కాదన్నారు. ఈ దాడుల్లో దాదాపు రూ.50కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. వరుస ఘటనలు చూస్తుంటే కాంగ్రెస్ పాలనలా కాకుండా భాజపా పాలనగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సెక్యులర్‌గా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. నిందితులను శిక్షించడంతో పాటు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో న్యాయవాది ఎంఏ షకీల్, సామాజిక కార్యకర్తలు సయ్యద్ మాజిద్ షుత్తరి, సయ్యద్ మహమ్మద్ అబ్దుల్ ఖదీర్ అలీమ్‌ఖాన్ ఫలాకి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలకు మంచి రోజులు

● జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతాం ● ఉచిత విద్యుత్తు అందిస్తాం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : రానున్న మూడు నెలల్లో గ్రంథాలయాలకు మంచి రోజులు వస్తాయని, రాష్ట్రాన్ని జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్తు అందించాలని ముఖ్యమంత్రికి నివేదిస్తామని తెలిపారు. వరుస ఉద్యోగ ప్రకటనలతో గ్రంథాలయాలకు నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు వస్తున్నా వారికి సరైన పుస్తకాలు అందుబాటులో లేవని.. సొంత భవనాలు, విద్యుత్తు, మూత్రశాలలు, తాగు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని న్యూస్‌టుడే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. గురువారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.



రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్‌తో ముఖాముఖి

న్యూస్‌టుడే : కొత్త మండలాల్లో గ్రంథాలయాలు లేవు. పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు?

డా.రియాజ్ : త్వరలో కొత్త మండలాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తాం. సొంత భవనాల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలను పరిశీలిస్తున్నాం.

? లైబ్రేరియన్ల కొరతతో గ్రంథాలయాలు మూసే ఉంటున్నాయి?

ఒక్కో లైబ్రేరియన్ మూడేసి గ్రంథాలయాల బాధ్యతలు చేపడుతున్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో గ్రంథాలయ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. ఈ విషయం గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తాం. రానున్న ఉద్యోగ ప్రకటనలో గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం. త్వరలో 33 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను నియమిస్తాం.

? పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త ముద్రణ పుస్తకాలు సరిపోవడం లేదు.

చిక్కడపల్లి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు అన్నీ గ్రంథాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. కొత్త ముద్రణ పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. దాతలు కూడా సహకరించి పుస్తకాలు అందిస్తున్నారు.

? ఏళ్లుగా సెస్సు నిధులు రాక గ్రంథాలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

అవును నిజమే. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయాలకు రూ.కోట్లలో సెస్సు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం వీటి గురించి అసలు ఆలోచించలేదు. మున్సిపాలిటీ, డీపీవో శాఖలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తాం. రానున్న రోజుల్లో సెస్సు వసూలు చేసి అభివృద్ధి పనులకు కేటాయిస్తాం.

? వరుస ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి పెరుగుతోంది. పఠన గదులు సరిపోక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు.

నిజమే. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేకంగా పఠన గదులు ఏర్పాటు చేస్తాం. అవసరమైన కుర్చీలు, బెంచీలు, ప్యాడ్లు సమకూరుస్తాం.


105 కిలోల గంట ఏర్పాటు



భారీ గంటకు పూజలు చేస్తున్న పండరీనాథ్ కుటుంబ సభ్యులు

బేల, న్యూస్‌టుడే : బేల మండల కేంద్రంలోని విఠల్, రుకుంబాయి ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుడు పండరీనాథ్ 105 కిలోల భారీ గంటను ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల కిందట ఇంటి ఆవరణలో సుందర ఆలయాన్ని నిర్మించిన ఆయన గురువారం భారీ గంటతో పాటు కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో హోమం చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్‌పీఎల్‌ఐలో ఆదిలాబాద్ డివిజన్ తొలిస్థానం



ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ

భుక్తాపూర్(ఆదిలాబాద్), న్యూస్‌టుడే : ఇటీవల దేశవ్యాప్తంగా గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) మేళా జరిగిందని, అందులో తెలంగాణ సర్కిల్ అయిదో స్థానంలో నిలిచిందని ఉమ్మడి జిల్లా తపాలా పర్యవేక్షకుడు దేవిరెడ్డి సిద్ధార్థ తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో ఆదిలాబాద్ డివిజన్ మొదటి స్థానంలో ఉండటం గర్వంగా ఉందన్నారు. రూ.11,20,000 ప్రీమియం వసూలైనట్లు పేర్కొన్నారు. సిబ్బంది సహాయ సహకారాలతోనే ఈ ఘనత సాధించామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ తపాలా జీవిత బీమా చేసుకోవాలని, అది భవిష్యత్తులో అత్యవసరాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19 కబడ్డీ పోటీల్లో 15 మంది బాలికలు, 15 మంది బాలురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నందిని, వైష్ణవి, శ్రీజ, శ్రీవల్లి, అంజలి, గంగ, అశ్విత, శిరీష, అనూష, సింధు, వేణుప్రియ, అక్షయ, సన్నిహిత, సనాఅంజుమ్, శ్రుతి, అబిషేక్, అంజన్న, వంశీకృష్ణ, కార్తిక్, వంశీ, మల్లేష్, అశ్విత్, జయవర్ధన్, అసద్, రాము, వినయ్, అభిషేక్, రామ్‌చరణ్‌తేజ, శ్రీమన్, క్రాంతి, ఆదర్శ్‌లు ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. వీరంతా నవంబరు 3వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు.

హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి

ముధోల్(బాసర), న్యూస్‌టుడే : బాసరలోని ఆర్జీయూకేటీలో 2023లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తనకు యూనివర్సిటీ అధికారులు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదంటూ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ ఈ నెల 22న హైకోర్టును ఆశ్రయించాడు. విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఫీజులు బకాయిలున్నాయని చదువు పూర్తయిన విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. పై చదువులు, ఉద్యోగాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలుమార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ చేసిన హైకోర్టు విద్యార్థికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ఆర్జీయూకేటీకి నోటీసులు జారీ చేసింది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి నోటీసులు అందలేదన్నారు. కోర్టు నోటీసులు వస్తే వారి ఆదేశాల మేరకు వివరాలను తెలియజేస్తామన్నారు.

న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

? పట్టణంలోని ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చాలి. పాత జీఎం కార్యాలయం చౌరస్తాలో గుంతలను పూడ్చేలా చూడాలి. - శ్రీనివాస్, బజార్‌ఏరియా

✔ పట్టణంలో గుంతలు పూడ్చడానికి నిధులు మంజూరయ్యాయి. ప్రకృతి వైపరీత్యాల నిధి కింద రూ.20 లక్షలు కేటాయించారు. - సందీప్, మున్సిపల్ ఏఈ

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం

? మండలంలోని చింతలపల్లి గ్రామం నుంచి పొలాలకు వెళ్లేదారి బురదగా మారింది. - శంకర్, స్థానికుడు

✔ గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి రైతుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - ధర్నీ సతీష్, పంచాయతీ కార్యదర్శి, చింతలపల్లి

పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లి గ్రామంలో పర్యటించారు. పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులు, క్రీడా ప్రాంగణం, మధ్యాహ్న భోజన సరకులను పరిశీలించారు. అనంతరం కన్నాల పంచాయతీలో ఎల్‌ఆర్‌ఎస్ నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. 489 మంది దరఖాస్తులు చేయగా ఇంకా 109 ఆన్‌లైన్ చేయలేదన్నారు. మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తపస్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ సాగు అవసరం

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులను ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల సాగు దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాణిజ్య, ఉద్యానవన, కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు 1800 ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించగా 289 ఎకరాలు పూర్తయిందని 100 శాతం పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ కింద ఉద్యానవన పంటలకు గుంతలు, మొక్కలు నాటే పనులకు నిధులు మంజూరవుతున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి కల్పన, ఉద్యానవన శాఖాధికారి అనిత, మ్యాట్రిక్స్ ఆయిల్‌పామ్ పరిశ్రమ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

దండేపల్లి, న్యూస్‌టుడే: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇస్రు రవి, పానుగంటి లింగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇక్కడ నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లోని అయిదు డీఏలు, బిల్లులు విడుదల చేయాలని, జీఓ నెం.317 ద్వారా నష్టపోయిన వారిని సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. అనంతరం జిల్లా శాఖ ఉపాధ్యక్షుడిగా నల్లెల సంతోష్, కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా బొలిశెట్టి బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా జాడి చిన్నయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా సౌజన్య, కార్యదర్శిగా శివప్రసాద్, కవితను ఎన్నుకున్నారు. నాయకులు చిట్ల రాజన్న, గుర్రం రామోహన్, బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపిక

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన రాజనాల కిషోర్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో సివిక్స్ పోస్టుకు ఎంపికయ్యారు. 5వ తరగతి వరకు గ్రామంలో, 10వ తరగతి వరకు దొనబండ ఉన్నత పాఠశాల, ఇంటర్, డిగ్రీలు లక్షెట్టిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పూర్తి చేశారు. కాకతీయ విశ్వ విద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు



కిషోర్

తేనెతుట్టె కదిలితే తంటా

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద ఇటీవల జరిగిన తేనెటీగల దాడులు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ నెల 14న అంత్యక్రియల కోసం పోచమ్మ చెరువు వద్దకు పలువురు వచ్చారు. ఇంతలో అక్కడ మిషన్ భగీరథ ట్యాంకుకు ఉన్న తేనెటీగలకు పొగ తగలడంతో ఒక్కసారిగా లేచి వెంటపడ్డాయి. మృతదేహాన్ని కిందనే పెట్టి అక్కడున్న వారంతా పరుగులు తీశారు. దాదాపు 15 మందిపై తేనెటీగలు దాడి చేశాయి. వారంతా పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. ఇదే నెల 20వ తేదీన సైతం మళ్లీ తేనెటీగలు అంత్యక్రియల కోసం వచ్చిన ప్రజలపై విరుచుకుపడ్డాయి. వారంతా పరుగులు తీయాల్సి వచ్చింది. నిత్యం ఇక్కడ ఇదే తంతు కొనసాగుతున్నా.. మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా తేనెతుట్టెలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



మిషన్ భగీరథ ట్యాంకుకు ఉన్న తేనెతుట్టె

సృజనాత్మకత చాటి.. విజేతగా నిలిచి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: వివిధ అంశాలపై విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో గురువారం ఈ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని మెదిపా భాను ప్రథమ స్థానంలో, 9వ తరగతి విద్యార్థి ఎస్.సిద్ధార్థ ద్వితీయ స్థానం, 9వ తరగతి విద్యార్థిని ఎం.కార్తిక తృతీయ స్థానం సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపల్ బిజ్జు కురువిళ్ల బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

మందమర్రి పట్టణం: విద్యార్థుల అంతర్గత ప్రతిభ వెలికి తీసేందుకు మందమర్రి శ్రీ చైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంపై లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా 147 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో కే.నిహారిక(10వ తరగతి) ప్రథమ, ఏ.సత్యసాత్విక(9వ తరగతి) ద్వితీయ, సీహెచ్.రితిక్(9వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమేష్, ఏజీఎం అరవింద్‌రెడ్డి, డీన్ ఎండీ ఇలియాజ్‌లు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.



మందమర్రి : గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం



మంచిర్యాల : వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు



మంచిర్యాల : విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు



మందమర్రి : శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ మోడల్ స్కూల్(మంచిర్యాల) విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జీవీఎల నిర్వహించిన అండర్-19 బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన అసద్, శ్రీమాన్, వైష్ణవి, సింధు, వేణుప్రియ, పి.చందన త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు ఆదర్శ పాఠశాల, కళాశాల పీడీ సుదీప్ తెలిపారు.

మంచిర్యాల విద్యావిభాగం: శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 విభాగంలో జిల్లా ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జోబిన్ పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

జోనల్‌స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల(కళాశాల) క్రీడా సమాఖ్య గురువారం ప్రాంతీయ(మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్) స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించింది. ఉమ్మడి జిల్లా కార్యదర్శి బాబురావు సమక్షంలో అండర్-19 బాలుర విభాగంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు ఆయా జిల్లాల నుంచి సుమారు 80 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. మెరుగైన ఆటతీరును కనబరిచిన వారిని వచ్చే నెల మొదటి వారంలో నిర్మల్ జిల్లాలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు బాబురావు తెలిపారు. డీఐఈఓ అంజయ్య ఎంపిక పోటీలను ప్రారంభించారు.

రక్తదానం అన్నింటికంటే గొప్పది

చెన్నూరు, న్యూస్‌టుడే: రక్తదానం మహాదానమని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరులు సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం చెన్నూరు సామాజిక ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులు పెద్దసంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. రక్తదాతలకు ఏసీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. చెన్నూరు సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.



చెన్నూరులో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏసీపీ, సీఐ తదితరులు

జైపూర్, న్యూస్‌టుడే: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఉత్తమ సేవలు అందిస్తున్నారని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జైపూర్ విద్యుత్తు కేంద్రంలోని డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది, ఎస్టీపీపీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు రక్తదానం చేశారు. అనంతరం దాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. 1996 ఉట్నూరు పోలీస్ స్టేషన్ దాడి ఘటనలో అమరుడైన పోలీసుకానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి భార్య వనజారెడ్డి ప్రస్తుతం జైపూర్ తసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలుసుకొని డీసీపీ ఆమెను సన్మానించారు. ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, జైపూర్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్లు, అనిల్‌రావు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సైలు శ్రీధర్, శ్వేత, సంతోష్, రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

నస్పూర్, న్యూస్‌టుడే: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నమోదవుతున్న కేసులు, పరిష్కారం, తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మంచిర్యాల గ్రామీణ సీఐ అశోక్, నస్పూర్ ఎస్సై సుగుణాకర్ పాల్గొన్నారు.

సెలవులో ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి సెలవుపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. లేఅవుట్ అనుమతి లేని ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయాలని కొద్ది రోజులుగా ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు ఆయనపై ఒత్తిడి చేయడంతో సెలవు పెట్టి వెళ్లినట్టు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఆ కార్యాలయం అధికారులు మాత్రం కోర్టు పని మీద రెండు రోజులు సెలవు పెట్టారని అంటున్నారు. ఆయన స్థానంలో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రదీప్‌ను ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు.

'మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు పెట్టాలి'

బెల్లంపల్లి పట్టణం, ఏసీసీ, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని కూరగాయల సముదాయానికి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కష్టపడి చదివి.. సీట్లు సాధించి..

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి మూడో జోన్‌కు చెందిన తుమ్మ అక్షయ్ నీట్ ప్రవేశ పరీక్షలో 534 మార్కులు సాధించారు. తాజాగా వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు దక్కించుకున్నారు. అక్షయ్ పది వరకు మందమర్రి మోడల్ పాఠశాల, ఇంటర్ హైదరాబాద్ కళాశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించారు. తండ్రి వేణు మరణంతో ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగా ఉంది. నీట్ ప్రవేశ పరీక్ష కోసం ఇంట్లో ఉండి ఆన్‌లైన్‌లో తరగతులు వింటూ సన్నద్ధం అయి సత్తా చాటారు.



అక్షయ్



సౌమ్యశ్రీ

☛ మందమర్రి పాతబస్టాండ్‌కు చెందిన చిలుక సౌమ్యశ్రీ నీట్ ప్రవేశ పరీక్షలో 546 మార్కులు సాధించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు లభించింది. సౌమ్యశ్రీ పది వరకు మంచిర్యాల, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి ఉచిత సీటు దక్కించుకున్నారు.

అల్లీనగర్ సెక్షన్ అధికారిణి సస్పెన్షన్

జన్నారం: కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని అల్లీనగర్ అటవీ సెక్షన్ అధికారిణి కిరణ్మయిజ్యోతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెల 9న అల్లీనగర్ గ్రామానికి చెందిన నగేశ్ ఇంట్లో రూ.50 వేల విలువైన అక్రమ కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంలో సెక్షన్ అధికారిణి కిరణ్మయిజ్యోతి నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ రేంజి అధికారిణి రమాదేవి విచారణ జరిపించి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించారు. దీంతో సెక్షన్ అధికారిణిని సస్పెండ్ చేస్తూ అటవీశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి

జన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని పైడిపెల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి మీద గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జన్నారం ఎస్సై రాజవర్ధన్ వివరాల ప్రకారం చింతలపల్లికి చెందిన కట్లకుంట రాజన్న(50) లక్షెట్టిపేట వైపు నుంచి జన్నారానికి వస్తుండగా పైడిపెల్లి సమీపంలో వాహనం అదుపుతప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. రాజన్న మృతి చెందగా ముల్కల్ల రవీందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై చెప్పారు.

మత్తడి ధ్వంసం కేసులో మరో వ్యక్తి అరెస్ట్

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని శనిక్కుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో ఇది వరకే 14 మందిని అరెస్ట్ చేయగా తాజాగా మరొకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను ఏసీపీ వెంకటేశ్వర్ గురువారం చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. మందమర్రిలోని మేదరిబస్తీకి చెందిన సతీశ్ అనే వ్యక్తి మత్తడి పేల్చివేతకు వినియోగించిన జిలిటెన్‌స్టిక్స్‌ను విక్రయించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. కేసులో నిందితుడైన బత్తుల సమ్మయ్య అనే వ్యక్తి మంచిర్యాలలో తనకు పరిచయం ఉన్న పేలుడు పదార్థాలు విక్రయించే డీలరు నితీశ్‌బిర్లా అనే వ్యక్తిని ఫోన్లో సంప్రదించి జిలిటెన్‌స్టిక్స్, డిటోనేటర్లు కావాలని అడిగగా ఆయన తన సూపర్‌వైజర్ సతీశ్‌ను కలవాలని చెప్పాడు. మత్తడి పేల్చిన నిందితులైన పెండ్యాల లక్ష్మీనారాయణ, భీం మధుకర్, గోగుల దానయ్య ఆ సూపర్‌వైజర్‌ను కలిసి రూ.6 వేలు చెల్లించి 25 జిలిటెన్‌స్టిక్స్, డిటోనేటర్లను కొనుగోలు చేశారు. గత నెల 16న మత్తడికి 21 జిలిటెన్‌స్టిక్స్ అమర్చి పేల్చి వేశారు. మిగిలిన నాలుగింటిని దానయ్య తన వద్ద ఉంచుకున్నాడు. ఈ కేసుతో సంబంధం ఉన్నందున సతీశ్‌ను అరెస్ట్ చేశామని, పేలుడు పదార్థాలు విక్రయించే డీలర్ నితీశ్‌బిర్లా పరారీలో ఉండగా అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఏసీపీ తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ, ఎస్సై

న్యాయస్థానంలో హాజరుకాని ముగ్గురి..

మంచిర్యాలనేరవిభాగం: మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు కేసుల్లో నిందితులై న్యాయస్థానంలో హాజరుకాని ముగ్గురిని గురువారం అరెస్టు చేసినట్లు సీఐ నరేష్ తెలిపారు. మంచిర్యాల న్యాయమూర్తి ఉషనిషద్విని ఉత్తర్వుల మేరకు నస్పూర్‌కు చెందిన తనుగుల నారాయణ, పులి తిరుపతి, మందమర్రికి చెందిన తీగల శంకర్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

యువకులపై వలపు వల

ప్రియుడు, ప్రియురాలు అరెస్ట్

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: యువకులకు వలపు వల విసురుతూ, బెదిరింపులకు పాల్పడి అందినంత డబ్బులు గుంజుతున్న ప్రియుడు, ప్రియురాలిని గురువారం అరెస్ట్ చేసినట్లు మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మందమర్రికి చెందిన బొద్దిరెడ్డి మౌనికకు జమ్మికుంటకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిన్నరగా మందమర్రిలో తల్లి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ప్రైవేటు ఉద్యోగం చేసుకునే మందమర్రి యాపల్‌కు చెందిన ఓ యువకుడికి ఫోన్ చేసి పరిచయం పెంచుకుంది. ఫొటోలు పంపించి మంచిగా మాట్లాడి నమ్మించింది. తన కొడుకు ఆసుపత్రిలో ఉన్నాడని చెప్పడంతో రూ.4,600 పంపించాడు. తిరిగి డబ్బులు ఇవ్వాలని యువకుడు అడగడంతో చరవాణి నంబరు బ్లాక్ చేసింది. అనంతరం ఇల్లంతకుంటకు చెందిన మౌనిక ప్రియుడు శనిగారపు మధుకర్ ఆ యువకునికి ఫోన్ చేసి ఎందుకు ఆమెతో మాట్లాడుతున్నావని బెదిరించాడు. పోలీస్ కేసు పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పలు దఫాలుగా రూ.85 వేలు వారు చెప్పిన నెంబర్లకు పంపించాడు. అయినా మరింత డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించిన సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌లు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రియుడు, ప్రియురాలిని అరెస్ట్ చేశారు. వీరు చాలా మందిని ఇలా మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన సీఐ, ఎస్సై, హెడ్‌కానిస్టేబుల్ అజయ్, రాము, కానిస్టేబుల్ సంపత్, హోంగార్డు ఉమను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

గంజాయి తరలిస్తున్న నిందితుల పట్టివేత

గంగాధర: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుని జైలుకు తరలించినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. బెల్లంపల్లికి చెందిన ఎండీ యాసిన్ కరీంనగర్ కాపువాడలో ఉంటూ.. రేకుర్తికి చెందిన ఆదిత్య, సుభాష్‌నగర్‌కు చెందిన పాషాలతో కలిసి ఏడాదిగా గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. గురువారం ఎప్పటిలాగే నాగపూర్ నుంచి కిలో గంజాయి కొనుగోలు చేసి గంగాధర నుంచి రామడుగు మండలం వైపు నడిచి వెళ్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సీఐ ప్రకాష్‌గౌడ్ రిమాండుకు పంపించారు.

నాటుసారా తయారు చేస్తున్న పలువురి బైండోవర్

జన్నారం: మండలంలో నాటుసారా, గుడుంబా తయారు చేయడం, విక్రయించడం చేస్తున్న పలువురిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద గురువారం బైండోవర్ చేసినట్లు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు తెలిపారు. తిరిగి ఇలాంటి నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా లేదా సంవత్సరం జైలు శిక్ష విధిస్తామని ఆయన పేర్కొన్నారు.

■ **స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి**

బెల్లంపల్లి పట్టణం: బెల్లంపల్లిలో ఏర్పాటు చేయబోతున్న 62 మెగా వాట్ల సోలార్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని తెలంగాణ దళిత సంఘాల ఐక్య వేదిక బెల్లంపల్లి పట్టణ కమిటీ అధ్యక్షులు రాజేష్ కోరారు. బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సమావేశానికి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యారామునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

■ **విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం**

మంచిర్యాల సిటీ: జిల్లా కేంద్రంలోని రాంనగర్ విద్యుత్తు ఉప కేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాల్, ఏఈ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, గోసేవమండల్ రోడ్, రాంనగర్, కాలేజీ రోడ్, ఎల్ఐసీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, పాతమంచిర్యాల, గణేష్‌నగర్, మేదరివాడ, రెడ్డికాలనీ, చింతపండువాడ, సంజీవయ్యకాలనీ, పవర్‌సిటీ, ఎడ్లవాడ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

■ **సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ**

మంచిర్యాల సిటీ: అత్యవసర వాహనాల(108) పైలెట్, ఈఎంటీలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ఆయా సిబ్బందికి రాష్ట్రస్థాయి అధికారులు గజేందర్, లింగాచారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విధుల్లో మెరుగైన పనితీరు కనబరుస్తున్న గంగన్న, గోపి, శహబాజ్‌లకు ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.



108 వాహనాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారి

సంక్షిప్తం

■ **వ్యక్తిగత దూషణలు సరికాదు**

లక్షెట్టిపేట: మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, ఆయన తనయుడు విజిత్‌రావుతోపాటు తనపై, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగతంగా దూషణలకు పాల్పడటం శోచనీయమని మున్సిపల్ ఛైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. గురువారం స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు నాయకులు తమ వయస్సు, హోదాను మరిచి మాట్లాడటం ఎంత వరకు సమంజసం అన్నారు.

■ **బ్యాండ్ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నిక**

మంచిర్యాల పట్టణం: బ్యాండ్ కార్మిక కళాకారుల సంఘం జిల్లా కమిటీని ఎనుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎండీ జలీల్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ తాజుద్దీన్ బాబా, ఉపాధ్యక్షులుగా సర్వర్ మియాను ఎన్నుకున్నారు.

■ **విద్యార్థులకు నవోదయ అభ్యసన సామగ్రి అందజేత**

దండేపల్లి గ్రామీణం: దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం జగిత్యాల జిల్లాకు చెందిన జ్ఞాన అకాడమీ ఛైర్మన్ గుండా కార్తిక్ నవోదయ అభ్యసన సామగ్రిని అందజేశారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ **పోలీసు ఠాణాలో ఓపెన్ హౌస్**

జన్నారం: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జన్నారం పోలీస్ ఠాణాలో గురువారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఆయుధాల పనితీరు, వాటి పేర్లు, ఠాణాలో ఫిర్యాదు చేసే విధానం, వేలిముద్ర యంత్రం పనితీరు, ఠాణాలో పనిచేసే అధికారులు, వారి హోదాల గురించి పాఠశాల విద్యార్థులకు జన్నారం ఎస్సై రాజవర్ధన్ వివరించారు.

■ **ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని వినతి**

ఏసీసీ: భవన నిర్మాణాలకు సంబంధించి అవసరమైన ఇసుక కొరత ఏర్పడినందున అధికారులు స్పందించి ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి సూరయ్య, జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న డిమాండ్ చేశారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో సమావేశమై మాట్లాడారు. పలు సమస్యలకు సంబంధించి కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రాన్ని అందించారు.

■ **కాకో అమ్మవారి ఆలయ రహదారికి మరమ్మతులు**

దండేపల్లి గ్రామీణం: దండేపల్లి మండలం గోదావరి నది ఒడ్డున కొలువైన పద్మల్‌పురి కాకో ఆలయానికి వెళ్లే రహదారికి గురువారం కాంగ్రెస్ నాయకుడు గడ్డం త్రిమూర్తి మరమ్మతులు చేయించారు. ఈ నెల 28న కాకో అమ్మవారి జాతరను పురస్కరించుకొని నిర్వహించనున్న ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతోపాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

■ **భక్తిశ్రద్ధలతో శివలీలా విలాసం ప్రవచనాలు**

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథాలయంలో గురువారం శివలీలా విలాసం అంశంపై నైమిశారణ్య పీఠాధిపతులు బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి చేసిన ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ఆయన ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో ముక్త రవి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

■ **చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దు**

మందమర్రి పట్టణం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక చైతన్యనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. పోలీసులు ఇంటింటికి తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 60 ద్విచక్రవాహనాలను పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు రాజశేఖర్, శ్రీనివాస్, అంజయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ **ఉపాధిహామీ పనుల పరిశీలన**

నెన్నెల: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్ పరిశీలించారు. నెన్నెల, ఘన్‌పూర్, నందులపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో నర్సరీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ నెలఖారుకు వంద శాతం నర్సరీల పని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఘన్‌పూర్‌లో ఇంకుడు గుంతల నిర్మాణం పనులను, నందులపల్లిలో స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

నిర్వాసితులు పునరావాస కేంద్రాలకు వెళ్లాలి



శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఉపరితల గని భూనిర్వాసితులు తమకు కేటాయించిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గుత్తేదారుపల్లి గ్రామానికి చెందిన బాధితులతో మాట్లాడారు. వీరికి శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 బ్యారెక్ కంపెనీ క్వార్టర్లలో పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఓసీపీ విస్తరణ గ్రామానికి చేరువగా వచ్చిందని ఎలాంటి ప్రమాదం జరుగక ముందే గ్రామం నుంచి వెళ్లిపోవాలని సూచించారు.

సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఉద్యోగార్థులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఉద్యోగాల భర్తీకి ఆరోగ్య సమస్యలున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం జీఎం కార్యాలయంలో ఎస్ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ అభ్యర్థుల మెడికల్ ధ్రువపత్రాలు పరిశీలించారు. దీనిలో 139 ఉద్యోగులకు 99 మంది హాజరయ్యారు. డీజీఎం(పీ) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డీవైసీఎంఓ పి.రమేష్‌బాబు, సమీరా సందాని, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి పట్టణం: మందమర్రి ఏరియాలో బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్ విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు గురువారం మందమర్రి జీఎం కార్యాలయం, శాంతిఖని గని కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్వోటూజీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఐఈడీ రాజన్న, వైద్యులు జయవాణి ఆధ్వర్యంలో సర్ఫేస్‌లోని 16 విభాగాల్లో వీరిని భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ చేపట్టారు.



మందమర్రిలో కౌన్సెలింగ్‌లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

గైర్హాజరు కార్మికులకు..

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్-1 గనిలో పని చేస్తున్న గైర్హాజరు కార్మికులకు గురువారం గని మేనేజర్ విజయ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ఏడాదిలో సెప్టెంబరు వరకు 70 మస్టర్లు పూర్తి చేయని కార్మికులు విధులకు రాకపోవడానికి కారణాలను ఇకపై నెలకు 20కిపైగా మస్టర్లు పూర్తి చేయాలని సూచించారు.

బెల్లంపల్లి పట్టణం: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో పనిచేస్తున్న మహిళా బదిలీ కార్మికులకు గురువారం సింగరేణి అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జీఎం(ఎస్ఓటూ) రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లు తాము ఎంచుకున్న ఉద్యోగాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి పంపించడం జరుగుతుందని చెప్పారు.